


"శాంతమ్మ చచ్చిపోయింది" అని విన్నప్పుడు ఎవరూ ఆశ్చర్యపడలేదు. మామూలుగానే "ఓహో" అన్నారు. "ఆఁ" అన్నవాళ్ళెవ్వరు లేకపోయారు.

చచ్చిపోయినప్పుడు "ఆఁ" అన్నవాళ్ళుగాని, "నా" అన్నవాళ్ళుగాని ఎవరు లేపోయారే అనే బెంగ శాంతమ్మకి లేదు. ఆమె చచ్చిపోయింది.

సహజమే. పుట్టడం చావడం కోసమే కదా!

ఇప్పుడు శాంతమ్మ చచ్చిపోతే బాధపడ్డ వాళ్ళు ఒక్కరు లేరు. కాని ఒకప్పుడు, ఆమె నొచ్చితే చాలు చచ్చినంత పనిచేసిన వాళ్ళు ఆ ఊళ్ళో ఎంతోమంది ఉన్నారు. "కో" అంటే కోటిమంది పరిగెత్తుకు వచ్చేవారు. ఆమె ఆడమంటే ఆడేవారు. పాడమంటే పాడేవారు. నిజంగా అలా చేయలేదు గాని, అంతటి ఆసక్తి చూపించేవారు.

మరి ఇప్పుడు. . . ?

ఏడ్చేదిక్కే లేదు!

దిక్కులన్నీ ఉన్నాయి. దిక్కులనిండా ఆమెపేరూ ఉంది కాని ఆ పేరుగల వ్యక్తి చచ్చిపోయినట్లు పేరు మాత్రం చావలేదు.

"నా" అనకపోయినా, "ఆఁ" అనకపోయినా, ఆమె పోయిన తరవాత కథలు చెప్పుకుని "ఇహిహి!" అన్న వాళ్ళున్నారు.

"ఇహీహీ" అన్నవాళ్ళలో మొదటివాడు కామయ్య.

అతని అసలుపేరు శివకామయ్య. అందరూ కామయ్య అని పిలుస్తారు.

యాభైతొమ్మిదో ఏడు దాటి, అరవయ్యవ ఏడు రుచి చూస్తున్నాడు. కాయశరీరం. ఏళ్ళ రుచులతో పాటు ఇంకా చాపల్యంకూడా తీర్చుకుంటున్నాడు. నల్లగా తుమ్మమొద్దులా ఉంటాడు. అరవై ఏళ్లంటే అందరూ నమ్ముతారు. తెలియనివాళ్ళు "ఉండవచ్చు" అంటారు. అందుకు కారణం అతని వయస్సు కాదు. ముఖం.

అతన్నిచూస్తే చింబోతు గుర్తు వస్తుంది., చింబోతుకికూడా అతనంటే భయమే. ఇప్పుడూ ఎప్పుడూ కూడా ఆ మనిషి అంతే. పైకిమాత్రమే సుమా!

అతను శాంతమ్మ చచ్చిపోయినప్పుడు "ఇహీహీ!" అనడానికి, అందులోను మొట్టమొదటిసారిగా అనడానికి కారణం ఏమిటి?

ఉంది.

చాలా గట్టి కారణమే ఉంది.

ఉండేఉంటుంది. ఉండకుండా ఎలా ఉంటుంది గనక?

కామయ్యకి ఇరవైమూడెకరాల మాగాణి ఉంది. మూడు వందల కాసులలో మాణిక్యం ఉంది. ఒక కాసులూ ఉంది. మాణిక్యాన్ని చూసుకుని, మూడు వందల కాసుల్ని చూసుకుని, కాసుల్ని చూసుకుని, మాగాణిని చూసుకుని మురిసిపోయేవాడు కామయ్య.

కామయ్య "'కావ్" మంటే కాకులన్నీ ఎగిరెగిరి వస్తాయి!

కాకులకి కామయ్యంటే అంతగురి. కామయ్యకి కాకులమీద అంతగురి. వీళ్ళ గురిచూశారూ అంటే ఎవరైనా సరే, హరీ!

కామయ్యకి ఇప్పుడు అరవయ్యేళ్ళు. వలభైయేళ్ల నాడు ఎలా ఉన్నాడో ఇప్పుడు అలానే ఉన్నాడు. ఏం మారలేదు.

కామయ్య ఊరికే శాంతమ్మచావుకి "ఇహీహీ" అనడు.

శాంతమ్మ మొగుడు రావుడు. రావుడు గోవులాంటి మనిషి

శాంతమ్మ చిలకలాంటి పడతి.

ఇద్దరూ పొట్ట చేతోపట్టుకుని ఆ ఊరు వచ్చారు.

కొత్తవాళ్ళు రావడం ఆ ఊరికి అదే కొత్త. అంతవరకు ఆ ఊళ్లో చొరబడి బ్రతుకుతెరువు చూసుకున్నవాళ్ళు లేరు.

కొత్త ఎప్పుడూ వింతే.

రావుడూ శాంతమ్మా ఊళ్లో అడుగు పెట్టకుండానే అందరి నోళ్లలోను నానిపోయారు.

**పల్లెలలోనూ మనుషులుంటారు. వారికీ మనసులుంటాయి. ఏ మనిషి మనసు ఎవరిమీదికి పోయినా, అందరికీ తెలిసిపోతుంది. కానీ అందరూ తెలియనట్లే ఉంటారు. చస్తే ఆవిషయం బయటకు పొక్కదు. నిజానికి ఆ వ్యక్తులు చచ్చిపోయినా బయటకు పొక్కదు. అది బహిరంగ రహస్యం. అదే శాంతమ్మలాంటి భర్తచాటు భార్యల కథల్లో మణిగిన సూత్రం.**

ఊరందరినోళ్లలోను నాని కామయ్యనోట్లో నానకుండా ఎలా ఉంటారు?

రావుడు పనికావాలని అందర్ని అడిగాడు. ఎవరి మట్టుకు వారే ఇస్తాం అన్నారు. ఆ అన్నవాళ్లందరు పెళ్లాల్ని అత్తవారింట్లోనో, మరేఊళ్లోనో ఉంచిన వాళ్ళు.

శాంతమ్మను చూసిన కామయ్యరావుణ్ణి వేరేచోట ఎలా పనిచెయ్యనిస్తాడు?

"హన్నన్నా. . ." అనుకున్నాడు.

"రామయ్యా. . . రావయ్యా. . ." అన్నాడు.

కామయ్యలాంటివాడ రావుణ్ణి రావయ్యా అని పిలిస్తే ఎలా వెళ్లకుండా ఉంటాడు?

"వస్తానయ్యా. . ." అన్నాడు.

అలా అన్నప్పుడు అతను ఉబ్బిపోవడం శాంతమ్మ కనిపెట్టింది. అని కళ్లలో నీళ్ళు తిరగడంకూడా చూసింది.

అందుకే రావుడంటే ఆమెకు ఒళ్ళుమంట!

'మనిషిలా ఉండడేం? అని సణుక్కుంది.

శాంతమ్మ చాలా తెలివైంది. రావుడిలాంటి అర్భకుణ్ణి కట్టుకున్నందుకు ఎప్పుడూ విచారిస్తూ ఉంటుంది.

ఒకోసారి అతనికి దొరికే గౌరవమర్యాదల్ని చూసి పొంగిపోతుందికూడా!

ఇంతోటి సన్నాసికి అంతంత సన్మానం ఎలా జరుగుతూంధా?' అని ఆకాశమంత అబ్బురపడిపోతుంది.

తనని గురించి తనకు తెలుసు. రావుడిని గురించీ తనకు తెలుసు. తను లోకానికి తెలిసినంతగా రావుడికి తెలియదు. అదే శాంతమ్మబాధ.

తను కూడా ఉన్నప్పుడే రావుడికి గౌరవమర్యాదలు అతిగా ఉంటాయని శాంతమ్మకు తెలియదు. అదే రావుడిబాధ.

"నువ్వు నా పక్కనుంటే రాజ్యాలేలేస్తానే" అంటాడు రావుడు.

'పిచ్చిమొద్దు' అనుకుంటుంది శాంతమ్మ.

అతనిలో కరిగిపోదు. మీదకు ఒరగనైనా ఒరగదు.

శాంతమ్మమీద రావుడికి ఎంత ఇష్టమో శాంతమ్మకి రావుడంటే అంత అయిష్టం. అయితే ఎవరో ఒకరు అండగా ఉండలిగా మరి. . . అందుకు రావుడు తోడు.

**బి. సీతారామమూర్తి**

శాంతమ్మ చాలా తెలివైంది. అని ఆమె అనుకుంది ఆమె తెలివయినదని ఎవరన్నా అంటే బావుండి పోను. ఆమెకు ఆమె అనుకోవడంతోనే గొడవంతా వచ్చిపడింది. అందానికితోడు తెలివి!

రావుడు పనిలోకి వెళ్ళాడు. రావుడు వెళ్ళలేదు. కామయ్య పంపించాడు.

కామయ్య చాలా ఉదారపురుషుడు. లేనివాళ్లను చూస్తే జాలి! పాపం!

శాంతమ్మనుచూసి రావుణ్ణి కనికరించి తన దొడ్లోనే పూరిపాకలో కాపరం పెట్టించాడు.

అతని దాతృత్వానికి గుండెనిండా కృతజ్ఞతలు నింపేసుకుంది, శాంతమ్మ.

"శాంతమ్మా. . ." అన్నాడు కామయ్య.

"వస్తున్నా బాబయ్యా. . ." అంటూనే మాట కంటే ముందు వచ్చింది శాంతమ్మ.

"రామయ్య ఉన్నాడా?. . ."

"లేడు బాబయ్యా. పనిలోకి వెళ్ళాడు. మీకు చెప్పలేదా?"

"చెప్పాడులే. నేనే మరిచిపోయాను. అలా వచ్చి కాస్త గింజలు కొలుస్తావేమిటి?"

"చిత్తం బాబయ్యా. . ."

గింజలు కొలిచి బస్తాల కెత్తింది.

ఆమె కొలుస్తున్నప్పుడు కామయ్య అక్కడే కూర్చున్నాడు. గింజలు కొలవడం లెక్కపెడుతూ కాదు. ఆమెను కొలుస్తూ లెక్కకడుతూ!

శాంతమ్మ చాలా విలవైనది. చులువుగా దొరుకుతుంది! దగ్గిరికి వెళ్లాడు.

కామయ్యకివన్నీ కొత్తేమి కాదు. చాలా అలవాటు.

శాంతమ్మ మాట్లాడలేదు.

మర్నాడు మాట్లాడలేదు.

ఆ మరునాడు మాట్లాడలేదు.

రోజులు జరిగినకొద్దీ రావుడు దూరమవుతున్నాడు. దూరం చేసేస్తోంది శాంతమ్మ.

నామకః రావుడు నామమాత్రంగానన్నా ఆమెకిప్పుడు కనిపించడం లేదు.

"కామయ్య కాసుల్ని వదిలేసిండు!"

ఊరు ఊరంతా అంటుకుంది.

కామయ్యకు మాణిక్యం ఉంది. ఆమెతో పడి మాన్యాలున్నాయి. అందుచేత అతన్నే అంటిపెట్టుకొని ఆ బాపతువన్నీ స్థిరపడిపోయాయి.

కొత్తగా వచ్చింది కాసులు. కాసులు ఆ ఊరికి రావడం కొత్తకాదు. ఆ ఊరిదే!

కామయ్య దగ్గిరికి రావడం కొత్త.

కొత్త కొన్నాళ్లకి రోత పుట్టించింది.

"కొత్త పిట్టనట్టే ఉండాలా. . ."

"అవును. . . . . . తెలవదేమిటి?"

తెలుసు, అందరికీ తెలుసు.

కొత్తపిట్టని కోరని వాళ్లెంతమంది ఉన్నారు!

వాళ్లందరికీ తెలుసు. ఊరందరికీ తెలుసు.

కాసులు లబోదిబోమంది.

అంతకు కొన్నాళ్ళక్రితమే మాణిక్యం అంది.

అలా అన్న కొన్నాళ్లకి మాణిక్యం మంచం పట్టింది. ఇప్పటికింకా విడిచి పెట్టలేదు. అలానే ఉంది.

అనువు చూసుకుని చనువు చేసుకుంటాడు కామయ్య.

మాణిక్యం మామూలుగా ఉంటే కామయ్య కదిలే వాడేకాదు.

ఊళ్లో వారందరూ కామయ్యకు రుడుస్తారు. కామయ్య మాణిక్యానికి రుడుస్తాడు. మాణిక్యమంటే భక్తికాదు. మాణిక్యంతో ఉన్నమాటంటే విశ్వాసం ఎక్కువ అతనికి అందుకు.

కాసులు ఊహ కాకులకు తెలిసింది.

కాకులు పూసుకున్నాయి. నోరు మూయించాయి

"ఒరే రావుడూ. . . ఈ మధ్య నీ పసెం బాగులేదురా!"

"చిత్తం బాబయ్యా. . ."
"బొత్తిగా బరితెగించి పోయావు. . ."
"చిత్తం బాబయ్య. . ."



మూర్తిత్రయం

చిత్రం — లిం (గోపన్నపాలెం)

"ఊళ్లో వాళ్లేమనుకుంటున్నారో తెలుసుదా?"
"చిత్తం బాబయ్య. . ."

"నువ్వు ఊళ్లో ఉంటే శాంతమ్మ ఉరేసుకుని చచ్చిపోద్దంట . . ."

"అమ్మ బాబోయ్. . ."

"అవున్రా. . . నిన్ను పొలంగట్టుంట వస్తుంటే సుబ్బన్న చెప్పాడు. . ."

రావుడు అమాయికంగా చూశాడు. వెనకాల నిజం కోసం ఆలోచిస్తున్నాడు. . . . . . . . .

అతనికి తెలిసిన నిజం ఒకటి. . .
కామయ్య చెప్పేవార్త ఒకటి. . .
"అవున్రా. . . మా అవిడికి. . . గంగూకి. . ."


## ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

## కీలక ఉగాది నవలల పోటీ

# 10,000 రూ. బహుమతులు

ప్రతి ఏడాదివలెనే కీలక ఉగాది సందర్భంలోనూ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక నవలలపోటీ నిర్వహిస్తున్నది. ప్లవంగ ఉగాది నవలల పోటీకి 7,500 రూపాయల బహుమతులు ఇచ్చాము. రచయితలను ఇతోధికంగా ప్రోత్సహించే లక్ష్యంతో కీలక ఉగాది నవలల పోటీకి 10,000 రూపాయల బహుమతులు ఇవ్వడానికి నిశ్చయించాము.

రచయితలు, రచయిత్రులు ఈ అవకాశం వినియోగించుకోవాలి. పాఠకులకు ఉత్తమమైన నవలలు అందజేయాలనే మా సంకల్పం సఫలం కావడానికి తోడ్పడాలని అర్థిస్తున్నాము.

**మొదటి బహుమతి రు. 5,000**
**రెండవ బహుమతి రు. 3,000**
**మూడవ బహుమతి రు. 2,000**

**పోటీలో పాల్గొనేవారు పాటించవలసిన నిబంధనలు ఇవి:**

1. రచన 250 అర తావు 8" × 12" సైజు కాగితాలకు మించరాదు.
2. సిరాతో కాగితానికి ఒక ప్రక్కనే వ్రాయాలి.
3. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
4. స్వీయ రచనలేకాని అనువాదాలు పంపరాదు.
5. కవరుమీద 'ఉగాది నవలల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.
6. బహుమతులు పొందని రచనలలో యోగ్యమైనవి ఆంధ్రప్రభ సచిత్రవార పత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది.
7. బహుమతి పొందని రచనలలో ప్రచురణార్హం కానివాటిని తిప్పిపంపే నిమిత్తం తగుమాత్రం తపాలా బిళ్ళలు అంటించిన, చిరునామా ఉన్న కవరు జతపరచి పంప వలసి ఉంది. లేకపోతే వాటిని తిప్పి పంపడం జరగదు.
8. రచనలు 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు—2'కు పంపాలి.
9. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.
10. ప్రచురణకు ఏ కలం పేరో ఉపయోగించినా తమ అసలు పేరును విధిగా వ్రాయాలి.

ప్రథమ బహుమతి పొందిన నవల ప్రచురణ ఉగాది ప్రత్యేకసంచికలో ప్రారంభం అవుతుంది

రచనలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ:

**1968 జనవరి 15**

"బా. . .బ. . . య్యా. . .!"

ఉలిక్కిపడ్డాడు కామయ్య.

రావుడిలో అంత పౌరుషం ఉంటుందనీ, మరీ అంత ఉద్రృతంగా ఉంటుందనీ కామయ్య ఎప్పుడూ కలగనలేదు.

"నా మీద విరుచుకు పడతావేంరా?. . . లోకుల నోరు మూయించు. . . చూద్దాం."

'కా. . . కు. . . లు. . .' అనుకున్నాడు రావుడు.

చటుక్కున కొడవలి తీశాడు.

కామయ్యమీదికి వచ్చాడు.

కామయ్యఒంటిమీద సెలయేళ్లు ప్రవహించాయి. భూకంపనం బయలుదేరింది. నోటంట మాట రావడంలేదు.

కామయ్య చచ్చిపోతాడు. మరుక్షణంలో చచ్చిపోతాడు

తప్పదు! తప్పించుకో లేడు.

"నీ నాలిక కోసేస్తాను. . ." అని ముందుకు వస్తున్నాడు రావుడు.

రావుడు ముందుకి వస్తున్నాడు.

చాపిన నాలిక లోపలికి తీసుకుని, పళ్లు గిట కరిచి కూలిపోయాడు కామయ్య.

పడిపోయిన కామయ్యకి అన్యథాశరణం నాస్తి. ఆస్తి కనిపించాడు!

పోయినప్రాణం బొందిలో దూరి, దూరంగా కామయ్యకోసమే వస్తూన్న గంగూని చూపించింది.

గంగూకి కబురంపాడు కామయ్య.

ఇలా జరుగుతుందని కాదు.

శాంతమ్మ కాళ్లపట్టీలు కంసాలి భద్రం దగ్గిర ఉన్నాయి. తీసుకురమ్మన్నాడు. తెచ్చి శాంతమ్మకిమ్మన్నాడు.

గంగూ కర్మకాలి కాళ్లపట్టీలు తెచ్చాడు.

ఆ సమయానికే తెచ్చాడు.

గంగూ శాంతమ్మ ఇంట్లోకి వెళుతూంటే రావుడు చూడాలి.

భలే అదును.

ఎలా?

చూపించడమెలా?

నోట మాట రావడం లేదు.

ఒళ్లంతా గజగజ లాడుతూంది.

వట్టుతూ నట్టుతూ

ఒక చేతిని రెండో చేత్తో పట్టుకుని, ఆ చేత్తో గంగూని చూపించాడు.

చూశాడు రావుడు.

గంగూ తన ఇంట్లోకి వెళ్లడం చూశాడు.

ఒక్క ఉరుకున పరిగెత్తాడు. . .

ఇంట్లో ఏం గొడవ జరిగిందో తెలియదు.

శాంతమ్మ అరుపు ఊరంతా వినిపించింది.

పోలీసులకి వినిపించాడు కామయ్య.

రావుడికి చచ్చేదాకా శిక్ష!

శాంతమ్మ విలవిలా ఏడ్చింది. మొత్తుకుంది.

కామయ్యమీద దుమ్మెత్తి పోసింది.

కామయ్యతో కలహమంటే మాటలు కాదు. చూడ్డానికి ఎంత భీకరంగా ఉంటాడో అంత భీరువు. అలాగని రావుడు నిరూపించేశాడు!

కామయ్యచేసే పని ఘోరం. అంతకంటే ఘోరం మరోటి ఉండదు.

శాంతమ్మను బయటికి దూరంగా నెట్టేశాడు.

శాంతమ్మ తప్పుడు పనులు మానుకుంది. అయినా కాకులు. హర్షింపు లేదు. పనిపాటూ ఏం లేదు. దొరక లేదు. కొన్నాళ్లు అడుక్కుంది. తరవాత అదీ దొరకడం దుర్లభమయిపోయింది. ఆ ఊళ్లోనించి వెళ్లిపోవాలనుకుంది. అనుకుంటూండగానే రోగం ముదిరింది. శరీరం కుళ్లిపోయింది. చచ్చిపోయింది!

రావుడికి విషయం తెలియదు. తెలిస్తే బతికేవాడే కాదు! ★

# నేత్ర దానం

"నేను చనిపోయిన తరవాత నా నేత్రాలు చూపులేని వారికోసం దానం చేస్తున్నాను" ఈ దానపత్రం వింతగా కనిపిస్తుంది. పద్మవిభూషణ్ నవాబ్ మేదీనవాజ్ జంగ్ తత్తుల్యమైన ప్రకటన



నవాబ్ మేదీ నవాజ్ జంగ్

చేసి, 28—6—67 న కాలధర్మం చెందారు. ఆ వార్త విన్న డాక్టర్ శివారెడ్డి, హుటాహుటిన అక్కడకు వెళ్లారు. కొన్ని నిమిషాలు, గదిలోని వారందరినీ బయటకు పంపి, నవాబ్ జంగ్ నేత్రాలు తీసుకున్నారు. పదినిమిషాలలో మేదీనవాబ్ జంగ్ నేత్రాలు ఒక మంచుపెట్టెలో భద్రంగా ఉన్నాయి. ఆ రోజు సాయంత్రం మంత్రి పి. వి. నరసింగరావు చేతుల మీదుగా, తండ్రిగారి నేత్రాలను, కుమారుడు లతీఫ్ నేత్రబ్యాంకుకు అందజేశారు.

నవాబ్ మేదీనవాజ్ జంగ్ సామాన్యుడు కాదు. గుజరాత్‌కు గవర్నరుగా పనిచేశారు. భారతప్రభుత్వంచే పద్మవిభూషణ్ బిరుదు పొందారు. గోల్కొండనవాబు అబ్దుల్లాకుతుబ్‌షా వంశీయుడు. ఉస్మానియావిశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడుగా పనిచేసినవాడు.

చనిపోయిన వారికళ్లు, బ్రతికుండి, అంధులుగా ఉన్నవారికి చూపు యిస్తాయా? అనేది ఆసక్తికరమైన అంశం!

ఈ విధమైన నేత్రచికిత్స మనదేశంలో ఇటీవల కాలంలో జరుగుతున్నది. చనిపోయిన వ్యక్తినేత్రాలు ఆరు గంటలలోగా వేరుచేయాలి. వాటిని 48 గంటల లోగా, మరొకరికి అమర్చాలి. అలాగని, చనిపోయిన అందరికళ్లు, ఎవరికంటే వారికి సరిపోవు. ఆప్టికల్ నెర్వ్ (నేత్రకణములు) సజీవంగా ఉన్నప్పుడే అవి చూపు నిస్తాయి. ఉదాహరణకు మశూచివల్ల, ఇతర ప్రమాదాల వల్ల, వళ్లగుడ్డుపై తెల్లపొర కమ్మినవారికి ఇవి బాగా ఉపయోగిస్తాయి. నేత్రాలలో మగ, ఆడ తేడా, ముసలి, పడుచు భేదం లేదు. ముసలివారినేత్రాలు యువకులకు ఉపయోగించవచ్చు. ఎడమకన్ను కుడికన్నుగానూ ఉపయోగించవచ్చు. ఆపరేషన్ రెండు, మూడు గంటలలో జరిగిపోవాలి.

చచ్చిపోయినవారికళ్లు పీకడానికి మనవారు ఒక

## శుభశ్రీ

పట్టాన వప్పుకోరు. చనిపోయినవారిపట్ల అగౌరవంగా ఉన్నట్టు భావిస్తారు.

ఆస్పత్రులకు వచ్చే అనాథ శవాలను, ఈ పనికి ఉపయోగించడం లేదు.

హైదరాబాదులో శ్రీ డాగే అనే పార్లమెంటు సభ్యుడు నేత్రదానం చేశాడు. అతని నేత్రాలు బుచ్చప్ప అనే అతనికి ఉపయోగించారు. నవాబ్ జంగ్ నేత్రాలు నామదేవన్ అనే కుర్రాడికి ఉపయోగించారు.

హైదరాబాదులోని సరోజినీదేవిఆస్పత్రిలో 'ఐ బ్యాంకు' ఏర్పాటైంది. ★



నామదేవన్